క్లుప్తంగా

ఉచిత సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలి

మాకవరపాలెం: ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో మూర్తి తెలిపారు. ఆయన మంగవారం మాట్లాడుతూ మే 15 వరకు అర్హులైన పేద విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మే 16 నుంచి 20వ తేదీ వరకు అర్హుల జాబితా సిద్ధం చేసి, 21 నుంచి 24వ తేదీ వరకు లాటరీ పద్ధతిలో 25 శాతం సీట్లను ఎంపిక చేస్తారన్నారు. పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

3వ తేదీన జాబ్ మేళా

నర్సీపట్నం : ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్‌లో ట్రైనీ సూపర్‌వైజర్స్, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ఉద్యోగాలకు మే 3వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. బీఎస్సీ, ఎంఎస్సీ (కెమిస్ట్రీ) 2021-24లో ఉత్తీర్ణులైన వారు, ప్రస్తుతం డిగ్రీ, పీజీ ఆఖరి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు ఉద్యోగానికి అర్హులన్నారు. 21 నుంచి 25 వయస్సు కలిగి ఉండాలని, తగిన ధ్రువపత్రాలతో ఆసక్తి గల విద్యార్థులు ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

వాహన ఆపరేటర్స్, డీలర్లతో సమావేశం


మాట్లాడుతున్న సీఎస్ డీటీ కుమార్

రోలుగుంట : డీలర్లు, రేషన్ సరఫరా వాహన ఆపరేటర్లతో మంగళవారం తహసీల్దార్ ఎస్.నాగమ్మ అధ్యక్షతన రేషన్ సరఫరా, లబ్ధిదారులు, డీలర్ల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీపై వచ్చి విధుల్లో చేరిన సీఎస్ డీటీ జి.వి.కుమార్ తనను పరిచయం చేసుకుని మాట్లాడారు. ప్రథమంగా మనం రేషన్ ఇవ్వడంలో లబ్ధిదారులతో అణుకువగా ఉండాలన్నారు. ప్రతి నెలా 1 నుంచి 15 లోగా రేషన్ సరఫరా జరగాలన్నారు. తూకంలో ఏవిధమైన తేడాలు రాకుండా కచ్చిత పద్ధతిని పాటించాలని కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ సీఎస్ డీటీ చెప్పింది తుచ తప్పక పాటించాలని ఆదేశించారు.

కొత్తభూమిలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు


కొత్తభూమిలో వైద్య పరీక్షలు చేస్తున్న హెచ్‌వీ భాగ్యలక్ష్మి

కె.కోటపాడు : వేసవికాలం దృష్ట్యా ప్రజలు వడగాడ్పుల బారిన పడకుండా ఉండేందుకు వైద్య సిబ్బంది వివరించే ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెచ్‌వీ భాగ్యలక్ష్మి అన్నారు. కొత్తభూమి గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య పరీక్షలను జరిపారు. 87 మందికి ఆరోగ్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు ఇచ్చారు. బీపీ, సుగర్ పరీక్షలతో పాటు గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. వేసవి సమయంలో వృద్ధులు, చిన్నారులు మధ్యాహ్న సమయాల్లో ఇంటి నుంచి బయటకు వెళ్లకూడదని హెచ్‌వీ భాగ్యలక్ష్మి సూచించారు.

మెప్మా సేవలపై అవగాహన ఉండాలి

నర్సీపట్నం : మెప్మా సేవలపై ఆర్పీలు సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని డీఆర్పీ మేడికొండ రాజశేఖర్ సూచించారు. పెద బొడ్డేపల్లి మెప్మా కార్యాలయంలో మంగళవారం మహిళాశక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. స్వయం సహాయక సంఘాల సమావేశాలను నిర్వహించడంతో పాటు వారు ఆర్థికంగా స్థిరపడేందుకు బ్యాంక్‌ల ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. సభ్యుల ఫ్యామిలీ మెంబర్స్ జీవనోపాధులను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యకలాపాలు సమర్థవంతంగా అమలు కావాలంటే ఆర్పీలు యాప్‌పై పట్టు సాధించాలన్నారు. వర్క్‌షాప్‌లో మెప్మా సీవోలు రమాదేవి, సీఎల్ఆర్పీలు హాజరయ్యారు.

గ్రంథాలయాలతో సృజనాత్మకత


విద్యార్థులకు బోధిస్తున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.త్రిమూర్తులరెడ్డి

నర్సీపట్నం : గ్రంథాలయం ద్వారా సృజనాత్మకతను పెంపొందించుకోవచ్చునని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.త్రిమూర్తులరెడ్డి విద్యార్థులకు సూచించారు. వేసవి వినోదం కార్యక్రమంలో భాగంగా మంగళవారం శాస్త్రీయ దృక్పథంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైన్స్ మ్యాజిక్ ఐటమ్స్ చేసి చూపించి విద్యార్థులకు నేర్పించారు. ప్రతి దానికి సైన్స్‌లో ఆధారం ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులతో దేశభక్తి గేయాలను పాడించారు. ఇండోర్ గేమ్స్ ఆడించారు. గ్రంథాలయ అధికారిణి దమయంతి, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభాకరరావు, సిహెచ్. భవానీ పలు అంశాలను బోధించారు.

కూలే వరకూ కన్నెత్తి చూడరా...!

- శిథిల వంతెనలు, కల్వర్టులకు కలగని మోక్షం
- వడ్డాదిలో పెద్దేరు వంతెనకు మంజూరు కాని నిధులు
- పేట తాచేరు వంతెనకు నిధులున్నా ప్రారంభం కాని పనులు
- వర్షాకాలం వస్తే కొట్టుకుపోనున్న డైవర్షన్ రోడ్లు


శిథిలమై కూలిన వడ్డాది పెద్దేరు నది


పేట డైవర్షన్ రోడ్డులో నిలిచిపోతున్న ట్రాఫిక్


పేటలో కూలిన తాచేరు వంతెన

బుచ్చెయ్యపేట : భీమునిపట్నం,నర్సీపట్నం(బీఎస్) రోడ్డులో శిథిల వంతెనలు, కల్వర్టులపై నుంచి ప్రయాణం నరక ప్రాయంగా మారుతుంది. బీఎస్ రోడ్డులో పలు వంతెనలు, బ్రిడ్జిలు, మదుంలు కూలుపోయి రవాణాకు తీవ్ర ఆటంకాలు కలుగుతున్నా ప్రభుత్వం కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికే బీఎస్ రోడ్డులో వడ్డాది పెద్దేరు నదిపై ఉన్న వంతెన, విజయరామరామరాజుపేట తాచేరు నదిపై ఉన్న వంతెనలు కూలిపోయాయి. దీంతో అనకాపల్లి, విశాఖపట్నం, పాడేరు, కాకినాడ, రాజమండ్రి, చోడవరం, నర్సీపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కృషితో వడ్డాది, విజయరామరాజుపేట గ్రామాల వద్ద కూలిపోయిన వంతెనల పక్క నుంచి సుమారు రూ.70 లక్షలతో రెండు వంతెనలు వద్ద డైవర్షన్ రోడ్లు ఏర్పాటు చేసి ప్రజలకు రవాణా సదుపాయం కల్పించారు. విజయరామరాజుపేట తాచేరు వంతెనకు రూ.ఐదు కోట్లు నిధులు మంజూరు చేయించారు. అలాగే వడ్డాది పెద్దేరు నదిపై కొత్త వంతెన నిర్మాణంకు రూ. 25 కోట్లతో అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు పంపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఎంపీ రమేష్, ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు విజయరామరాజుపేట తాచేరు వంతెనను పరిశీలించి నిధులు ఉండడంతో వెంటనే తాచేరు వంతెన పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అయితే పది నెలలైనా నేటికీ తాచేరు వంతెన పనులు ప్రారంభించకపోగా, వడ్డాది పెద్దేరుపై కొత్త వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు. వర్షాకాలం వస్తే పెద్దేరు, కోనాం రిజర్వాయర్లు గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తే వడ్డాది, పేటలో ఉన్న రెండు డైవర్షన్ రోడ్లపై నుంచి వరద నీరు ప్రవహించి మూడు జిల్లాల ప్రజల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. వంతెనలకు ఇరు వైపులా ఉండే ప్రజల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతాయి. ఇదే రోడ్డులో ఉన్న చోడవరం వద్ద గోవాడ వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉంది. లోపూడి, బంగారుమెట్ట, శింగవరం, పీడీ పాలెం, విజయరామరాజుపేట, గోవాడ తదితర గ్రామాల వద్ద పలు మదుంలు, కల్వర్టులు శిథిలమై గోతులు పడి ఉన్నాయి. మరో రెండు నెలల్లో వర్షాకాలం రానుంది. నదులు, వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తే డైవర్షన్ రోడ్లుపై నుంచి నీరు ప్రవహించి శిథిల మదుంలు, కల్వర్టు కూలిపోయి రవాణాకు తీవ్ర ఆటంకాలు కలిగేలా ఉంది. తక్షణం ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి మూడు జిల్లాల ప్రజలకు రవాణా ఆటంకం కలగకుండా బీఎస్ రోడ్డులో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి వంతెనలు, మదుంలు, కల్వర్టుల నిర్మాణం జరిగేలా చూడాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.


లోపూడి, బంగారుమెట్ట గ్రామాల మధ్య దెబ్బతిన్న కల్వర్టు

మోదకొండమ్మ పండగకు సన్నాహాలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ అప్పలరాజు

మాడుగుల : ఈ ఏడాది ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ పండగ అత్యంత వైభవంగా జూన్ 3 వ తేదీన నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని, ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు అన్నారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 3 వ తేదీన పండగ నిర్వహించుటకు ముహూర్తం ఖరారు చేయడం జరిగిందన్నారు. అమ్మవారి సతకం పట్టు వద్ద మే 1 వ తేదీన రాట ఉత్సవం జరగనుందని, 4 న అమ్మవారి ఆలయం వద్ద పండగ చాటింపు జరుగుతుందని అన్నారు. 6వ తేదీన అమ్మవారి ఆలయం నుంచి అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలు సతకం పట్టువద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్తామని, అక్కడ నెల రోజులు కొలువు దీరిన తర్వాత తిరిగి పండగ రోజు ఆలయానికి చేరుకోవడంతో పండగ పూర్తవుతుందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పది తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు


ప్రత్యేక తరగతులకు హాజరైన పది తప్పిన విద్యార్థులు

నర్సీపట్నం : పదో తరగతి పరీక్ష తప్పిన విద్యార్థులకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తురకబడి)లో మంగళవారం ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. హెచ్‌ఎం కె.వి.రమణ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు పదో తరగతి తప్పిన విద్యార్థులను గుర్తించి, వారి ఇళ్లకు వెళ్లి ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకున్నారు. సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు వారికి ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు.

ముగిసిన ఉచిత పాలిసెట్ కోచింగ్


కోచింగ్ సెంటర్‌కు సహకరించిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కె.వి.రమణ, శ్రీను తదితరులు


పాలిటెక్నిక్ కోచింగ్ ముగింపు కార్యక్రమానికి హాజరైన విద్యార్థులతో నిర్వాహకులు

దేవరాపల్లి: ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని వజ్ర సంకల్పంతో కృషి చేస్తే విజయం వర్తిస్తుందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో దేవరాపల్లి ఉషోదయ స్కూల్లో ఈ నెల 4న ప్రారంభించిన ఉచిత పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసి కోచింగ్ సెంటర్ ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోచింగ్‌కు హాజరైన విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి ప్ర.ప.ఐ. జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ మాట్లాడారు. తమ సంస్థ ఆధ్వర్యంలో 2018 నుంచి ఈ ప్రాంత విద్యార్థులకు అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో ఉచిత కోచింగ్‌ను నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కోచింగ్ తీసుకున్న విద్యార్థులంతా మంచి ర్యాంకులు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు ఖ్యాతి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్ నిర్వహణకు సహకరించిన ఉషోదయ స్కూల్ యాజమాన్యం పెద్దాడ వెంకటరమణ, వేచలపు అప్పలనాయుడును కోచింగ్ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కొరుపోలు శ్రీను, గంగవంశం సంతోష్, ఉప్పు అజయ్, గుల్లిపల్లి రవి, సుమారు 150 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు


రోలుగుంట గ్రంథాలయంలో మ్యూజికల్ చైర్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

రోలుగుంట : స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వరలక్ష్మి వేసవి శిక్షణ శిబిరాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చే విద్యార్థులకు నీతి కథలు, పెయింటింగ్, భక్తి గీతాలు వంటి పుస్తకాలు ఏర్పాటు చేశారు. మంగళవారం వారికి మ్యూజికల్ చైర్ ఆటల పోటీ ఏర్పాటు చేయగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మాట్లాడుతూ చిత్రలేఖనం, చదరంగంతో పాటు మెదడుకు పదును పెట్టే వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నీతికథల ద్వారా విజ్ఞానం

మాడుగుల రూరల్ : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా, కె.జె.పురం శాఖా గ్రంథాలయంలో మంగళవారం పాఠశాల విద్యార్థులకు నీతికథలు చదివి వినిపించారు. పాఠశాల అటెండర్ వి.శృతి ఆధ్వర్యంలో విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు, పంపిణీ చేశారు. ఆటలు, పాటల ద్వారా జూన్ 6 వ తేదీ వరకు శిబిరం గ్రంథాలయంలో నిర్వహిస్తామని శృతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇతర సిబ్బంది అప్పలనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కూడా పాల్గొన్నారు.

కొమిరలో తాగునీటి సమస్య పరిష్కరించండి


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

రావికమతం : మంటలంలో కొమిర బీసీ, ఎస్టీ కాలనీలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని మంగళవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ నెల 7న అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై మండల ఈవో పీఆర్‌డీ భుజంగరావు పరిశీలన చేశారు. ఎగువన ఉన్న ఇళ్లకు ప్రత్యేక పైపు ఏర్పాటు చేసి నీరిస్తామని చెప్పారు. ఈ సమస్య పరిష్కారమైనట్టు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు క్లోజ్ చేశారు. కానీ సమస్య పరిష్కారం చేయలేదన్నారు. చుట్టు పక్కల అందరికీ నీళ్లు వస్తున్నాయని,మా ఇళ్లకు నీళ్లు రాకపోవడంతో తాము అనేక ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. అధికారులు స్పందించి తక్షణమే మంచి నీటి సమస్య పరిష్కారం చేయాలని బూరిగ లక్ష్మి, రేణుక,తోక లక్ష్మి తదితరులు కోరారు.

తీవ్రవాదం నశించాలి


పహల్గాం మృతులకు నివాళులర్పిస్తూ చీడికాడ మండలం జైతవరంలో కొవ్వొత్తులతో ర్యాలీ

మాడుగుల/చీడికాడ : తీవ్రవాదం నశించాలని, భారతీయులు వర్ధిల్లాలని, మాదిగల ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు అన్నారు. చీడికాడ మండలం జయతవరం గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మాదిగ ఉద్యోగుల సంఘం మహాజన సోషలిస్టు పార్టీల ఆధ్వర్యంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఏర్పాటు చేసిన కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్నారు. ఉగ్రవాదాన్ని అరికట్టి మృతి చెందిన కుటుంబాలను ఆదుకోవాలన్నారు.కార్యక్రమంలో మారడ బూడి నాగరాజు, కంటిపాము మంగయ్య, ఈశ్వరరావు, చిన్న సంతోష్, వివిధ గ్రామాల నుంచి వచ్చిన సభ్యులు పాల్గొన్నారు.

చెరువు గర్భంలో ఆక్రమణలపై సర్వే


పెదబొడ్డేపల్లి చెరువు మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో రమణ

నర్సీపట్నం : మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లి పెద్ద చెరువు గర్భంలోని ఆక్రమణల తొలగింపునకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు మంగళవారం సర్వే చేపట్టారు. పెదబొడ్డేపల్లి సర్వే నంబరు 7, బలిఘట్టం సర్వే నంబరు 1/2 కు సంబంధించిన మ్యాప్‌లను ఆర్డీవో క్షుణ్ణంగా పరిశీలించారు. ఆక్రమణలు గుర్తించి చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు. సర్వే గురించి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఆర్డీవో పలు సూచనలు చేశారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ రామారావు ఉన్నారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు


అవగాహన కల్పిస్తున్న వైద్య నిపుణులు

చోడవరం : క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ వైద్యురాలు, ట్రస్ట్ చైర్మన్ శాంతి సౌందర్య అన్నారు. అంకుపాలెం గ్రామంలో సోడదాసి శ్రీనివాస శామ్యూల్ చారిటబుల్ ట్రస్ట్, హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రధానంగా నోరు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లపై అవగాహన కల్పించారు. 150 మందికి వైద్య సేవలు అందించగా వీరిలో 56 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. వీటితో పాటు సాధారణ వైద్యపరీక్షలు, ఎముకల సమస్యలపై వైద్యసేవలు అందించారు. వైద్యులు నమిత, వేణు, సరోజిని పాల్గొని రోగులకు వైద్యం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగులాపల్లి రాంబాబు, నడుపూరి దేముడు మాస్టారు పాల్గొన్నారు.

టీడీపీ సంస్థాగత ఎన్నికలకు కమిటీలు

మాడుగుల రూరల్ : టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా, గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు మండల దేశం పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అద్దిపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు తెలిపారు. మంగళవారం వారు క్లస్టరు ఇన్‌చార్జిలతో కలిసి జంపెన, జాలంపల్లి, ఎల్.పొన్నవోలు, సత్యవరం గ్రామాల నూతన కమిటీలను ఏర్పాటు చేశారు.

15వేల మందికి ఉపాధి పని కల్పించడమే లక్ష్యం


మాధవనగరం వద్ద తాండవ కాలువలో పూడికతీత పనులు పరిశీలిస్తున్న ఏపీవో దాసరి కొండాజీ

నాతవరం : వచ్చే నెల నుంచి ఉపాధి హామీ పథకంలో రోజుకు 15వేల మందికి పని కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని ఉపాధి హామీ పథకం ఏపీవో దాసరి కొండాజీ అన్నారు. ఆయన మంగళవారం మాధవనగరం వల్సంపేట నాతవరం చమ్మచింత ప్రాంతాల్లో తాండవ కాలువలో పూడికతీత పనులు తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే అధికంగా నాతవరం మండలంలో ఉపాధి హామీ పథకంలో కూలీలకు పని కల్పించేందుకు టార్గెట్ ఇచ్చారన్నారు. ప్రస్తుతం మండలంలో రోజుకు 10వేలకు పైగా కూలీలు పని చేస్తున్నారన్నారు. ఈ ఏడాది కొత్తగా తాండవ ఆయకట్టుకు నీరు ప్రవహించే తాండవ కాలువలో పూడిక తొలగించేందుకు ఉపాధి హామీ నిధులు రూ.కోటి 50లక్షలు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో కాలువలో పూడికతీత పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. పనిచేసే ప్రతి వ్యక్తి రోజుకు రూ.307 వచ్చేంత పని చేయాలని సూచించామన్నారు. పంట పొలాలకు నీరు ప్రవహించే పిల్ల కాలువలు సైతం సిమ్మెంటు లైనింగ్ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు అవి కూడా త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా పశువుల నీటి కుండీలు నిర్మిస్తున్నామన్నారు.

కేజీబీవీలో అదనపు తరగతి భవనాలకు నిధులు మంజూరు


కేజీబీవీ జూనియర్ కళాశాలకు అదనపు వసతుల పనులకు శంకుస్థాపన చేసిన చోడవరం ఎమ్మెల్యే రాజు

రోలుగుంట : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలకు అదనపు వసతుల కల్పన కోసం సమగ్ర శిక్ష పథకం నుంచి రూ.కోటి 64 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో నిర్మాణ పనుల చేపట్టేందుకు చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు మంగళవారం ఇక్కడకు వచ్చి స్థానిక నాయకులతో కలసి శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోలుగుంటలో పదో తరగతితో పాటు జూనియర్ కళాశాల నడవడం మండలవాసుల అదృష్టం అని ఈ అవకాశాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. క్రమ శిక్షణతో కూడిన విద్యాబోధన అందించడంతో పాటు ఈ ఏడాది శతశాతం ఫలితాలు, మండల ప్రథమ, ద్వితీయ టాపర్లుగా నిలిచిన విద్యార్థులను, ఎస్వో తులసిని, ఉపాధ్యాయ సిబ్బందిని అభినందించారు. ఈ ఫలితాలను ఇలాగే కొనసాగించి మండలానికి మంచిపేరు తేవాలని ఆయన ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర యవజన విభాగం ఉపాధ్యక్షుడు పంచాడ చంద్ర, ఎంపీటీసీ ఎస్. కృష్ణ, పాలకేంద్రం అధ్యక్షుడు రుత్తల శ్రీను పాల్గొన్నారు.

రావికమతం : చోడవరం నియోజకవర్గంలో మూడు కేజీబీవీ పాఠశాలల్లో 18 అదనపు తరగతి భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు తెలిపారు. గర్నికం కేజీబీవీ పాఠశాలలో నిర్మించనున్న తరగతి గదులకు మంగళవారం భూమి పూజ చేశారు. వీలైనంత త్వరగా నిర్మాణం పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు నరసింహారావుకు సూచించారు. మరపాక ఉపాధి పనుల్లో అవకతవకలపై విచారణ జరిపించాలని ఎంపీటీసీ సభ్యుడు గెంజి సూర్యనారాయణ ఎమ్మెల్యే రాజును కోరారు.

కిశోర బాలికలకు వేసవిలో అవగాహన తరగతులు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో మంగతాయారు

దేవరాపల్లి : కిశోరి బాలికలకు వేసవి సెలవుల్లో అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్టు ఐసీడీఎస్ కె.కోటపాడు ప్రాజెక్టు అధికారిణి వి.మంగతాయారు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం కిశోరి వికాస్ సమ్మర్ క్యాంప్‌పై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు, వెలుగు వీవోఏలు పాల్గొన్నారు. కౌమార దశ, వారి ఆరోగ్యం, లింగ వివక్ష, విద్య, సాధికారత, పోషణ, రక్షణ, శానిటేషన్, బాల్య వివాహాలు తదితర అంశాలపై 11 నుంచి 18 ఏళ్ల వయసులోపు కిశోరి బాలికలకు వేసవి సెలవుల్లో అవగాహన తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. వారానికి రెండు రోజులు చొప్పున 36 సెషన్స్‌ను ప్రతి గ్రామంలో నిర్వహిస్తామన్నారు. ఈ సెషన్స్ నిర్వహణలో గ్రామ స్థాయిలో కన్వీనర్‌గా గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్ఎం లేదా ఎంఎల్‌హెచ్‌పీ, వీవోఏ, ఆశా కార్యకర్తలు సభ్యులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఎస్.ప్రభాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎం.రాములమ్మ, ఎస్.కళ్యాణి, జి.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఎం.కోడూరు మోదమాంబ సన్నిధిలో భక్తుల దీక్షలు


ప్రత్యేక అలంకరణలో మోదమాంబ అమ్మవారు

మాడుగుల రూరల్ : మండలంలో ఎం.కోడూరు మోదమాంబ ఆలయంలో మోదమాంబ మాలాధారణ భక్తుల సంఖ్య క్రమేపీ పెరుగుతుంది. ఈ ఆలయం వద్ద కొత్తగా అమ్మవారి మాలాధారణ కార్యక్రమం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్, ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవిరావు ఆధ్వర్యంలో మాలాధారణ చేసే ప్రతి భక్తులకు ఉచితంగా వస్త్రాలు, మాలలు, అందజేశారు. మధ్యాహ్నం సమయంలో మాలాధారణ భక్తులకు భిక్ష ఏర్పాటు చేసారు. రాత్రి సమయంలో చద్ది కార్యక్రమం, ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిన రమణబాబు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు సహకారంతో ఏర్పాటు చేస్తున్నారు. తాటిపర్తి శివారు ద్వారకానగర్‌కు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో మాలాధారణ చేశారు. గురుమాత పాలకుర్తి శ్రీనివాసరావు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ సారథ్యంలో ప్రతి రోజు ఉదయం సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

కొరుప్రోలు గిరిజన గ్రామంలో ఆర్డీవో పర్యటన


కొరుప్రోలులో గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో రమణ, తహసీల్దార్ నాగమ్మ

రోలుగుంట : నర్సీపట్నం రెవిన్యూ డివిజన్ కార్యాలయ అధికారి (ఆర్డీవో) బి.వి.రమణ రోలుగుంట తహసీల్దార్ నాగమ్మతో కలసి ఎం.కె.పట్నం శివారు కొరుప్రోలు గిరిజన గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. అక్కడ గ్రామస్తులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. అసలే అటవీ ప్రాంతం అని, ఏ అవసరానికైనా తమ గ్రామం నుంచి మండల కేంద్రం రోలుగుంట కాని, పట్టణప్రాంతం నర్సీపట్నం కాని, తమ పంచాయతీ ఎం.కె.పట్నం గాని వెళ్లి వచ్చేందుకు సరైన రహదారి లేక ఇబ్బంది పడుతున్నట్టు ఆర్డీవోకు విన్నవించారు. ఆయా గ్రామ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని ఆర్డీవో హామీ ఇచ్చారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం : ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐల్లో 2025-26 విద్యా సంవత్సరానికి మొదటి విడత ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చునని జిల్లా కన్వీనర్, ఐటీఐ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసచార్యులు తెలిపారు. మే 24వ తేదీ లోపు అప్లికేషన్ ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసిన విద్యార్థులు దగ్గరలో గల గవర్నమెంట్ ఐటీఐలకు వెళ్లి మే 26వ తేదీలోపు సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9491813637, 9885596699, 8790741378 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.